క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పట్టణంలోని సాంబశివపేట నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని పల్నాడు బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 170 మందికి పైగా రోగులకు డాక్టర్ నెల్లూరి రమేష్, బీపీ, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, నరాల వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కల పంపిణీని పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య, డాక్టర్ నెల్లూరి రమేష్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సభ్యులు కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరావు, సిలార్ మసూద్, ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

నరసరావుపేటరూరల్: లింగంగుంట్లలోని రెండు ఆలయాల్లో చోరీ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని చెరువుకట్టు సెంటర్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఆలయాల్లోని హుండీలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి కానుకలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులకు హుండీ పగులకొట్టి ఉండటం కనిపించింది. ఆయన స్థానికులకు సమాచారం ఇవ్వడంతో ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమశేఖర్ సేవలు అభినందనీయం



వినుకొండ(నూజెండ్ల): ఉపాధ్యాయుడిగా కొమ్మాలపాటి సోమశేఖర్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని శారదాంబ ఫంక్షన్ హాల్‌లో కొమ్మాలపాటి సోమశేఖర్ ఉద్యోగ విమరణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతస్థాయికి ఎదిగేందుకు సోమశేఖర్ కృషి చేశారన్నారు. అనంతరం సోమశేఖర్, వెంకటరత్నం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జఫ్రుల్లా, ప్రముఖ వైద్యులు అన్నవరపు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ జన్మదిన వేడుకలు




రొంపిచర్ల: స్థానిక చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చిన వారికి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి జన్మదిన కేక్, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చిరువ్యాపారిపై కేసు నమోదు

యడ్లపాడు: పోలీసుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించిన చిరువ్యాపారిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రమైన యడ్లపాడులోని కొత్తూరు సెంటర్‌లో హైవే సర్వీసు మార్గం పక్కనే గోపీకృష్ణ న్యూడిల్స్ వ్యాపారం చేస్తున్నాడు. శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో పోలీసులు గోపీకృష్ణ బండి వద్దకు వెళ్లి వ్యాపారం నిలిపివేయాలని చెప్పారు. దీంతో పోలీసులతో గోపీకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆదివారం అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా స్వామి వారి ఊరేగింపు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి కళ్యాణ మహోత్సవ 16 రోజుల పండుగ వేడుకలను జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుదర్శన హోమంలో 12 మంది దంపతులు యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా భక్త బృందం వసంతోత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాలతో స్వామివారి ఉత్సవమూర్తులతో ఊరేగింపు కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో బి.వి.నరసింహారావు, రమేష్, శ్రీనివాసరావు, మహిళా భక్త బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యం

- కొరవడిన పర్యవేక్షణ
- రుచి, పచిలేని మధ్యాహ్న భోజనం
- విద్యార్థులకు ఇచ్చిన బూట్లలో వ్యత్యాసాలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పడిపోతున్న హాజరు శాతం



ఎండుగంపాలెం ఎంపీపీ స్కూల్ గోడలకు నెర్రెలు



శిథిలావస్థకు చేరిన యడ్లపాడు ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూల్

చిలకలూరిపేట: సర్కారు స్కూళ్లకు నిర్లక్ష్యపు నీడపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్య రంగానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో విద్య, వసతులు, గోరుముద్దతో మంచి పౌష్టికారం, విద్యాకానుక, ఇంగ్లీష్‌మీడియం, టోఫెల్ వంటివి అందించడంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు స్కూళ్లకు ధీటుగా పోటీపడ్డాయి.కూటమి ప్రభుత్వం రావడంతో ప్రభుత్వ బడులు నిర్వహణలో మార్పు కానవస్తుంది. మధ్యాహ్న భోజనంలో రుచితో పాటు నాణ్యత కొరవడింది. నియోజకవర్గంలో కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లు మినహా మిగిలిన పాఠశాల్లో 15,391 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో సగటున మధ్యాహ్న భోజనం పథకాన్ని 13,100 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. నిర్వాహకుల్ని తొలగించి కూటమి నేతల అనునయులకు వాటిని అప్పగించడంతో పౌష్టికాహారం సంగతి అటుంచితే, నాణ్యత పూర్తిగా కొరవడుతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. దీంతో పలు పాఠశాలల్లో పిల్లలకు ఇంటి నుంచే క్యారియర్లు పట్టుకొచ్చే పరిస్థితి నెలకొంటుంది. విద్యాకానుకల పంపిణీలో నిర్లక్ష్యం తొంగి చూస్తోంది. ఇందుకు ప్రతిమండలం లోనూ కనీసం 200 నుంచి 300 వరకు విద్యార్థులకు సరిపోని బూట్ల పంపిణీయే నిలువెత్తు సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. వీటికి ఉపాధ్యాయుల కొరత తోడయింది. కొత్త ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం తల్లికి వందనం వాయిదా వేయడం, టోఫెల్ రద్దు చేయడం వంటి చర్యలు మరింత ప్రభావం చూపటంతో ప్రభుత్వ పాఠశాలల హాజరుశాతం క్రమేణ తగ్గిపోతోంది.



తిమ్మాపురంలో నాసిరకంగా ఉన్న అన్నం



వినుకొండలో మధ్యాహ్న భోజనం చేస్తున్న తక్కువమంది విద్యార్థినులు

ఇలా ఒక్కొక్క సమస్య వచ్చి చుట్టుముట్టడంతో ప్రభుత్వ పాఠశాలలు పూర్వ దుస్థితి దశకు చేరుకుంటాయేమో అన్న ఆందోళనను విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో వేధిస్తున్న టీచర్ల కొరత

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరం గా ఉంది. మొత్తం 310 ప్రభుత్వపాఠశాలు ఉండగా 27,995 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 736 టీచర్లకు గాను 665 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బొల్లాపల్లి మండలంలో 9 ఉన్నత పాఠశాలల్లో ఏ సబ్జెక్టులో కూడా పూర్తి స్థాయిలో టీచర్లు లేరు. గుమ్మనంపాడు, బొల్లాపల్లి, మేళ్లవాగు, రేమిడిచర్ల, గుట్లాపల్లి, రావులాపురం పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక చదువులు కుంటుపడుతున్నాయి. అలాగే యూపీ పాఠశాలల నుంచి హైస్కూల్‌లుగా గత ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల్లో కనీసం ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. 288 మధ్యాహ్న ఏజెన్సీలు ఉన్నాయి. పనిచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసేవిద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. అలాగే ప్రభుత్వపాఠశాళల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు కిచెన్‌షెడ్‌లు కూడా కొన్నిచోట్ల లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో..

కేటగిరీ	పాఠశాల సంఖ్య	విద్యార్థులు సంఖ్య	టీచర్ల పోస్టులు	ప్రస్తుతం ఉన్న టీచర్లు
ప్రాథమిక పాఠశాలలు	154	6,326	449	393
ప్రాథమికోన్నత	11	853	60	58
ఉన్నతపాఠశాలలు	25	8,212	397	372
కస్తూర్బా విద్యాలయం	2	499	30	30
ఏపీ గురుకులాలు	2	760	37	37
ఏపీ మోడల్‌స్కూల్	1	565	21	20
మొత్తం	195	17,215	994	910

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు

నాదెండ్ల: చిలకలూరిపేట రూరల్ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకున్నట్లు చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు చెప్పారు. శనివారం రాత్రి నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఇటీవల సీఐగా విధుల్లో చేరిన ఆయన తొలిసారి స్టేషన్‌కు సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. కేసుల వివరాలు, దర్యాప్తుపై చర్చించారు. 2014–16లో నాదెండ్ల ఎస్ఐగా విధులు నిర్వర్తించిన సీఐ సుబ్బనాయుడును వివిధ గ్రామాల నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.



సీఐ సుబ్బనాయుడును సత్కరిస్తున్న నాదెండ్ల గ్రామ నాయకులు

శివప్రియనగర్ అభివృద్ధికి సమష్టి కృషి

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు సమష్టిగా కృషి చేసి సాధించుకుందామని శివప్రియనగర్ ప్లాట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు పేలూరి రామారావు చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్‌తో పాటూ రోడ్డు పునరుద్ధరణ పనులు నిర్వహించినట్లు చెప్పారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు లేఔట్‌ను పరిశీలించారన్నారు. ఈ ఏడాది వినాయక చవితి రోజున జాతీయ రహదారిపై శివప్రియనగర్ ఎదురుగా వినాయక విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి దివ్వెల సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ వీరాంజనేయులు పాల్గొన్నారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

శావల్యాపురం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు రంగం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సారథ్యంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాలల పరిధిలో నోటీసు బోర్డులో విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు ప్రదర్శించినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఎన్నికలు చేతులెత్తి విధానంలో జరుగుతాయన్నారు. అలాగే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దిశ నిర్దేశం చేశామన్నారు. 05న ఓటర్ల జాబితాలో ఎమైనా అభ్యంతరాలు స్వీకరణ ఫిర్యాదులు ఉంటే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలోగా పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. అదేరోజు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఎన్నికల నిర్వహణ కోసం తుది ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శన చేస్తున్నారన్నారు. ఈనెల 8న ఎన్నికల ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు.

ఏసు బోధనలు అనుసరించాలి

దాచేపల్లి: విశ్వాసంలో విశ్వాసులు మరింతగా బలపడాలని ఏఈఎల్‌సీ పశ్చిమ గుంటూరు సీనడ్ నాయకుడు గొట్టిముక్కల ఐజయ్య అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక ఆరాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజయ్య మాట్లాడుతూ.. ప్రభువైన ఏసుక్రీస్తు చెప్పిన బోధనలు పాటించాలని, సాతాను పెట్టే ప్రలోభాలకు తలొగ్గకుండా క్రీస్తు రాకడ కోసం కనిపెట్టుకుని జీవించాలన్నారు. 185 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఈఎల్‌సీ ఎన్నో సంఘాలను స్థాపించిందని, క్రీస్తు రాకడ కోసం విశ్వాసులను సంఘాలు సిద్ధం చేస్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం ఐజయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్, ఏఈఎల్‌సీ డెలిగేట్ వినుకొండ బాబు పాల్గొన్నారు.



ఐజయ్యని సన్మానిస్తున్న సంఘస్తులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు కరెంట్ ఉండదని చెప్పారు. గణపవరం పరిధిలోని వేలూరు రోడ్డు, చవిటిపాలెం, రాజీవ్‌గాంధీకాలనీ, సినిమాహాల్ సెంటర్ ఏరియా ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు భావనారుషి ఆలయంలో పూజలు

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా పూర్తి రాతితో నిర్మించనున్న భద్రావతి సమేత భావనారుషి ఆలయం పైకప్పు నిర్మాణ పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో చేపట్టిన ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి జాతీయ రహదారి వద్ద నుంచి ఆలయం వరకూ పైకప్పు రాయికి మేళతాళాలతో కోలాట భజనలతో ఆలయం ప్రాంగణానికి చేర్చనున్నట్లు తెలిపారు.

సెంట్రింగ్ షాపులో చోరీ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో ఓ సెంట్రింగ్ దుకాణంలో చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రత్తిపాటి దేవరాజు సెంట్రింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే దేవరాజు శనివారం రాత్రి విధులు ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దుకాణం వద్దకు రాగా షట్టర్‌కు వేసిన తాళాలు పగలగొట్టి కనిపించాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా నిర్మాణ పనులకు అద్దెకిచ్చే చెక్క సామగ్రి అపహరించుకు పోయారని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ రూ.10వేలు ఉంటుందని తన ఫిర్యాదులో పేర్కొనట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ



చండీహోమంలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ

నరసరావుపేట రూరల్: ఆషాఢ మాసం చివరిరోజు ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. మహిళలు పొంగల్లు పొంగించి అమ్మవారికి సారెలు సమర్పించారు. భక్తుల రద్దీతో ఆలయంలోని క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. ఆలయంలో నిర్వహించిన చండీహోమంలో 50 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో సేవా టికెట్ల ద్వారా రూ.2.25లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయంలో అన్న ప్రసాదవితరణ గావించారు. అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణం వేగంగా జరుగుతున్నదని, దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని ఈఓ కోరారు.

రౌడీషీటర్‌లు ఘర్షణలకు దిగితే పట్టణ బహిష్కరణ

నరసరావుపేట టౌన్: రౌడీషీట్ కలిగిన వ్యక్తులు గొడవల్లో పాల్గొంటే పట్టణ బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషటర్‌లకు ఆదివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. రౌడీషీట్ కలిగిన వ్యక్తులు అవాంఛనీయ ఘటనల్లో పాలుపంచుకున్న, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి 11 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై తిరగరాదన్నారు.



రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయ్ చరణ్

రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో..

నరసరావుపేటరూరల్: రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. రౌడీషీటర్లకు ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రోశయ్య మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రి 10గంటలకు దుకాణాలు మూసివేయాలన్నారు. 11గంటల తరువాత అనవసరంగా బయట కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీ దత్తాలో మహిళకు క్లిష్టతరమైన స్టంటు అమర్చాం

కేరళలో చిప్ సమ్మిట్‌లో వెల్లడించిన డాక్టర్ కృష్ణకాంత్



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకాంత్

నరసరావుపేట: పట్టణానికి చెందిన 55 ఏళ్ల మహిళకు క్లిష్టతరమైన స్టంటు విజయవంతంగా అమర్చిన విధానం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేరళ రాష్ట్రంలోని ఎర్నాకుళం నగరంలో నిర్వహించిన చిప్ సమ్మిట్-2024లో తెలియచేసినట్లు శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తెలిపారు. శని, ఆదివారాల్లో కేరళలో నిర్వహించిన అంతర్జాతీయ గుండె వైద్యుల శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖ గుండె వైద్య నిపుణులు పాలు పంచుకుని గుండె వైద్య విధానాలలో వస్తున్న పలు నూతన పద్ధతులపై విస్తృతంగా చర్చించారన్నారు. దీనికి తాను హాజరై క్లిష్టతరమైన గుండె రక్తనాళాల స్టంట్ అమరిక గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సహచర వైద్య బృందానికి తను విజయవంతంగా నిర్వహించిన విధానాన్ని తెలియజేశామన్నారు. ఆ మహిళకు పుట్టుకతోనే కుడి రక్తనాళం వైకల్యంతో ఉన్నదని, ఎడమ దమని నుండి విడివడి వస్తుందని నిర్ధారించామన్నారు. ఇటువంటి క్లిష్టతరమైన సమస్యలకు సాధారణంగా వాడే వైద్య పరికరాలతో ట్రీట్మెంట్ నిర్వహించలేమని గ్రహించి అత్యాధునిక వైద్య పరికరాలతో నాలుగు గంటల పాటు శ్రమించి క్లిష్టతరమైన స్టంట్ అమరికను విజయవంతంగా చేశామని చెప్పారు.

మక్కెన చినరామయ్యకు ఘన నివాళి

వినుకొండ(నూజెండ్ల): మక్కెన చినరామయ్య సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొనియాడారు. మక్కెన చినరామయ్య వర్ధంతి కార్యక్రమం సందర్భంగా మండలంలోని పెదకంచర్ల, హసన్నాయునిపాలెంలోని చినరామయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ చినరామయ్య ఆశయసాధన కోసం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మక్కెన కుమారుడు మణికంఠ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



జెట్టిపాలెంలో చౌడేశ్వరి అమ్మవారు

రెంటచింతల: స్థానిక బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వీర క్షత్రీయుల ఇలవేల్పు చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానాల ప్రధాన అర్చకులు అనీల్ కుమార్ శర్మ నేతృత్వంలో వేకువజాము నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచాంమృతాభిషేకాలు, నవగ్రహ మండపారాధన, సహస్ర కుంకుమార్చన, మంత్ర పుష్పం తదితరాలు జరిపించారు. అమ్మవారికి అలంకరించిన వెండి తొడుగు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొని బోనాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు దేవస్థానం వద్ద మహాన్నదానం చేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేశారు. దేవస్థానం పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చల్లని తల్లి చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆశీస్సులతో పైరు పంటలు సమృద్ధిగా పండి గ్రామస్తులు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. కట్టమూరి నాగేశ్వరరావు, కట్టమూరి శ్రీనివాసరావు, దుగ్గిరాజు గోపాలకృష్ణమూర్తి చౌడేశ్వరి దేవికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో వేంచేసిన తొగటి వీరక్షత్రీయుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం కనుల పండువగా ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భవనగిరి ఆంజనేయ శర్మ నేతృత్వంలో ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, అభిషేకాలు, నవగ్రహ మండపారాధన, సహస్ర కుంకుమార్చన జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సుమారు 200 మంది భక్తులు బోనాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు మహాన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన బండిపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు

మాచర్ల : ప్రతి ఒక్కరు కూడా యేసు బోధనలు అనుసరించి తోటి వారితో ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండాలని ముఖ్య అతిథి, క్రైస్తవ సేవకులు ఆత్మీయ దైవజనులు గుళ్ళపల్లి మోజెస్ అన్నారు. మరనాత విశ్వాస సమాజం 25వ వార్డులో నిర్వహిస్తున్న 20వ వార్షికోత్సవంలో ఆయన ఉపవాస ప్రార్థనలు ప్రారంభించి మాట్లాడారు. చర్చి పాస్టర్ రెవరెండ్ వై.వెంకటేశ్వరరావు (ఎలిషా) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేమ పూర్వక దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా మోజెస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 20 సంవత్సరాల క్రితం వెనుకబడిన ఈ ప్రాంతంలో యేసు ప్రభువు ఆశీస్సులతో నిర్వహించిన మరనాత విశ్వాస సమాజం ఈ రోజు వందలాది మంది క్రైస్తవుల ఆదరణ పొందడం ఎంతో సంతోషకరమన్నారు. 40 రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు కఠినంగా అనుసరించి మరనాత ప్రభువు ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా శక్తివంతమైన దైవ సందేశాలు, ప్రత్యేక ప్రార్ధన జరిపి అన్ని సంఘాల కాపరులను, పెద్దలను, విశ్వాసులను పిలిచి సందేశాలు అందించారు. సెప్టెంబర్ 11వ తేదీ వరకు జరిగే ఈ ప్రార్థనల్లో భక్తులు రెండు పూటల పాల్గొనాలని పాస్టర్ ఎలిషా కోరారు. ఈ సందర్భంగా సిరిగిరిపాడు గ్రామానికి చెందిన సురేష్, శిరీష దంపతులు, వృద్ధులు, అనాథ మహిళలు, వితంతువులకు నూతన వస్త్రాలను అందించి అన్నదాన కార్యక్రమం జరిపారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

రెంటచింతల: మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ పెదప్రోలు శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కాలనీలలో చేపట్టిన పారుశుద్ధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో సైడు కాల్వలలోని పూడికలను తొలిగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సైడు కాల్వల్లోని మంచినీటి పైపు లైన్లను తొలిగించి కాల్వలకు పైభాగంలో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో మనం పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. వర్షాకాలంలో విష జ్వరాలతో పాటు పలు రకాల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు.